నారు పోతకు చలో చలో

- ముమ్మరంగా పొలం పనులు
- శారదా నదిలో పుష్కలంగా నీరు
- ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలు


దిమిలి సమీపంలో విత్తనాలు జల్లుతున్న రైతు


యంత్ర సాయంతో దుక్కి చేస్తున్న రైతు

రాంబిల్లి : ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమై బిజీబిజీగా ఉన్నారు. శారదా నదిలో పుష్కలంగా సాగు నీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో నీరు ప్రవహిస్తోంది. యలమంచిలి నియోజకవర్గంలో ప్రధాన పంటగా రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో రాంబిల్లి మండలంలో దాదాపు 8వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. యలమంచిలి మండలంలో 5500 ఎకరాలు, మునగపాక మండలంలో 4100 ఎకరాలు, అచ్యుతాపురం మండలంలో 2800 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరి విత్తనాలు వేశారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో పాటు శారదా నదిలో ప్రవహిస్తున్న నీరుతో తడులు పెట్టారు. దీంతో నారు ఇప్పటికే నాటింది. మిగిలిన ప్రాంతాల్లో ముమ్మరంగా వరి విత్తనాలు వేస్తున్నారు. యంత్రాలను వినియోగిస్తూ రైతులు దుక్కి పనులు చేస్తున్నారు. సాగులో యంత్ర వినియోగంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

జగనన్న సర్కారు రైతులకు అండగా నిలుస్తుంది. రైతు భరోసా నిధులను క్రమం తప్పకుండా ప్రతి ఏటా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ సాయం సాగు ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. ఆర్‌బీకేల ద్వారా సకల సేవలు అందిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారు.

రైతులకు సాగు విధానంలో సందేహాలు నివృత్తి చేస్తూ సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను ఆదుకుంటున్నారు.

వాతావరణం అనుకూలిస్తోంది



వాతావరణం అనుకూలించడంతో ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉన్నాం. శారద నదిలో నీరు ప్రవహిస్తోంది. ఆర్‌బీకేల ద్వారా రాయితీపై విత్తనాలు సరఫరా చేసారు. రైతులకు ప్రభుత్వ సహకారం బాగుంది.

– బొద్దపు రాజు, రైతు, దిమిలి

యంత్ర సాయంతో మేలు



సాగు విధానంలో రైతులు మరింత యంత్ర వినియోగంపై దృష్టి సారించాలి. యంత్ర వినియోగంతో సాగు ఖర్చులు తగ్గడమే గాక పనులు త్వరితగతిన పూర్తవుతాయి. కూలీల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

– శ్రీకాంతగౌడ, హరిపురం కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త

సకాలంలో సేవలు



రైతులకు అవసరమైన సేవలను ఆర్‌బీకేల కేంద్రంగా అందజేస్తున్నాం. ఇప్పటికే విత్తనాలను రాయితీపై పంపిణీ చేశాం. ఎరువులు సిద్ధం చేస్తున్నాం. యంత్రాలను రాయితీపై అందజేశాం. సాగు విధానం, తెగుళ్లు, నివారణ చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు ఆర్‌బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

–సి. సుమంత, ఏవో , రాంబిల్లి మండలం

క్లుప్తంగా

ఘనంగా మహా సుదర్శన యాగం


తిమ్మరాజుపేటలో మహా సుదర్శన నరసింహ యాగం జరుగుతున్న దృశ్యం

మునగపాక : తిమ్మరాజుపేటలో మంగళవారం మహా సుదర్శన నరసింహ యాగం ఘనంగా నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వరుని ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగం జరిగింది. సుదర్శన స్వామి పుట్టినరోజు కావడంతో ఈ యాగం కార్యక్రమాన్ని తలపెట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ క్యాలెండర్ పంపిణీ


సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి మేలు జరుగుతుందని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని మూలపేటలో సంక్షేమ పథకాలకు సంబంధించిన క్యాలెండర్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి ఇంతవరకు లబ్ధి చేకూరని వారి కోసం జగనన్న సురక్ష ఉద్దేశించారని తెలిపారు.

రీ సర్వేపై ఆర్‌డీవో ఆరా

మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ–సర్వే వేగవంతమయ్యేలా చూడాలని అనకాపల్లి ఆర్‌డీవో చిన్నికృష్ణ కోరారు. మంగళవారం మునగపాక రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ఆయన ఇంతవరకు ఎన్ని గ్రామాల్లో రీ–సర్వే పూర్తయింది, ఏఏ గ్రామాలో సర్వే జరుగుతుందని తహసీల్దార్ పి.ప్రకాశరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్లు వేయించాలన్నారు. ఇందుకోసం రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట డీటీ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.


వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో మన్మథరావు తెలిపారు. ఒంపోలు(ఓసీ జనరల్, బీసీ–డి మహిళ, బీసీ–డి పురుషుల)కు సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. చెర్లోపాలెం(ఓసీ జనరల్), తిమ్మరాజుపేట(ఓసీ జనరల్), తోటాడ(బీసీ ఏ మహిళ), టి.సిరసపల్లి–1(బీసీ–డి మహిళ), మునగపాక–1,2(బీసీ–డి మహిళ, బీసీ–డి పురుషుడు, బీసీ–డి మహిళ), టి.సిరసపల్లి–2(బీసీ–డి పురుషుడు) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 26, 27 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వలంటీర్ల 31న పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

మునగపాక : గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. పంచాయతీల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మన్మథరావు, ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్ సమావేశంలో పాల్గొన్నారు.

కార్పొరేట్ ఫీ'జులుం' అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

పాయకరావుపేట : కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు సమకూర్చాలని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మండల నాయకులు జగదీష్, కరుణాకర్, పూజిత పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరల కోసం ఉద్యమించాలి


రైతు సదస్సులో మాట్లాడుతున్న రైతుసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

మునగపాక: పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కేందుకు రైతులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన రైతు సదస్సు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపించాలని, పాలకు కనీస మద్దతు ధర రూ.70 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సు, ఆగస్టు 9న సేవ్ అగ్రికల్చరల్, క్విట్ కార్పొరేట్ పేరుతో జరిగే కార్యక్రమాలను రైతులంతా జయప్రదం చేయాలన్నారు. రైతు సంఘ నాయకుడు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునగపాక రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, రైతుస్వరాజ్య వేదిక నాయకుడు బాలు గాడి, రైతు సంఘ నాయకులు గణేష్, అప్పలరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లకు అనుమతులు వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణులు

యలమంచిలి : రిలయన్స్ కార్పొరేట్ సెలూన్ షాపుల వల్ల నాయీ బ్రాహ్మణుల వృత్తి అంతరించిపోయే ప్రమాదం ఉందని యలమంచిలి నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం యలమంచిలి కొమ్మాయిగుండం శివపార్వతుల ఆలయం వద్ద యలమంచిలి నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో రిలయన్స్ కార్పొరేట్ సంస్థ సెలూన్ షాపులను బ్యూటీ పార్లర్‌లు, బ్యూటీ సెలూన్‌లను పట్టణ ప్రాంతాల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోందని, వాటికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తే నాయీబ్రాహ్మణ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు ఉపాధి కోల్పోవలసి వస్తుందని అన్నారు. సంప్రదాయ చేతి వృత్తిని నమ్ముకున్న నాయీబ్రాహ్మణులకు జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని అన్నారు. నాయీబ్రాహ్మణులకు షాపులకు 150 యూనిట్ల కరెంట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అందుకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కాగా పట్టణంలో సామాజిక భవనం లేక నాయీ బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి పట్టణంలో ఎక్కడైనా 5 సెంట్లు స్థలం మంజూరు చేస్తారని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు కందికుప్ప గోవిందరావు, ప్రధాన కార్యదర్శి, కడిమి అప్పలరాజు, కోశాధికారి చల్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బ ముసురేసింది...


రాంబిల్లి ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఓ మాదిరి వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి వాతావరణం ముసురుకుంది. రోజంతా అడపా దడగా చిరు జల్లులు పడ్డాయి. మధ్యాహ్నం సమయంలో 15 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పలు రోడ్లపై వర్షం నీరు నిలిచింది. వరి నారుమడులకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

మునగపాక : మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది.ఉదయం నుంచి జోరున వర్షం కురిసింది. అల్పపీడన కారణంగా వర్షాలు కురుస్తుండడంతో అటు ప్రజలు, ఇటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి నారుమడులకు, దమ్ములకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

అక్కడక్కడా కుండపోత

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరు జల్లులు పడగా మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం ఎదుట భారీ వర్షపు నీరు నిలిచిపోయింది. పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. ఈ వర్షంతో నారుమడులకు జీవం వస్తుందని రైతులు చెబుతున్నారు.

విస్తారంగా అవిశ సాగు


కైలాసపట్నంలో సాగులో ఉన్న అవిశ

కోటవురట్ల : మండలంలో అవిశ విస్తారంగా సాగవుతోంది. ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేపట్టడానికి రైతులు ముందస్తుగా అవిశ నారు పోస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ముందుగా అవిశను సాగు చేసి ఎరువుల భారాన్ని తగ్గించుకుంటున్నారు. మండలంలో కైలాసపట్నం, రాజుపేట, గొట్టివాడ, చౌడువాడ, రామచంద్రపురం, కోటవురట్ల ప్రాంతాలలో అవిశ సాగు చేస్తున్నారు. వరి నాట్లు వేయడానికి ముందుగా అవిశ నారుతో పాటు దున్నేసి మడిలో కుళ్లిపోయేలా చేస్తారు. తద్వారా భూమి సారవంతం అవుతుంది. పూర్తిగా కుళ్లి భూమిలో కలిసిపోయాక వరి నాట్లు వేస్తారు. దీని వల్ల రసాయనిక ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా వరిలో మంచి దిగుబడి సాధ్యపడుతుందని రైతులు చెబుతున్నారు.

ఇంటింటి సర్వేలో మాజీ ఎమ్మెల్యే

నక్కపల్లి : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల పరిశీలన (ఇంటింట సర్వే)లో పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మంగళవారం దేవవరం గ్రామంలో సర్వే ఏవిధంగా జరుగుతోందనే విషయాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ ఓట్ల గల్లంతు కాకుండా చూసుకోవాలని, మార్పులు చేర్పుల విషయంలో కుటుంబ యజమాని డిక్లరేషన్ ఉండాలని, ఓటర్ల అనుమతి లేకుండా ఓట్లను తొలగించరాదని అన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే ఏఈఆర్‌వో దృష్టికి తీసుకురావాలన్నారు.

పీహెచ్‌సీలు తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రాంబిల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

రాంబిల్లి: రాంబిల్లి పీహెచ్‌సీ, లాలంకోడూరు హెల్త్ క్లినిక్‌లను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. మందులు తనిఖీ చేశారు. ల్యాబ్ పరీక్షలు, పరీక్షల ఫలితాల తీరుపై ఆరా తీశారు. ఎన్‌సీడీ–సీడీ సర్వేను శతశాతం పూర్తి చేయాలని, హెల్త్ ఎడ్యుకేషన్ చార్టులు, ఐఈసీ మెటీరియల్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. లాలంకోడూరు హెల్త్ క్లినిక్‌లో మందులు తక్కువగా అందుబాటులో ఉంచడంతో పూర్తి స్థాయిలో మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

ఓటరు సర్వే సక్రమంగా చేయాలి


బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న ఈఆర్‌వో రామలక్ష్మి

పాయకరావుపేట : మండలంలో ఓటర్ల నమోదుకు సర్వే సక్రమంగా చేయాలని ఈఆర్‌వో రామలక్ష్మి ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఎల్‌వోలతో సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఫారమ్ 6,7,8 పట్ల బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు.

మణిపూర్ బాధితులకు సంఘీభావం



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పాయకరావుపేట : మణిపూర్ బాధితులకు సంఘీభావంగా సీపీఐ, మండల సమితి ఆధ్వర్యంలో చిత్ర మందిర్ థియేటర్ సెంటర్లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బందుల సుబ్బలక్ష్మి, మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, నక్కపల్లి మండల కార్యదర్శి అజయ్ పార్థ, చీడిపల్లి చక్రవర్తి, వీరబ్బాయి, ఎన్.అప్పారావు, నక్కపల్లి మండల చీడిక గ్రామ ఆదివాసీలు పాల్గొన్నారు.

మునగపాకలో నేడు జగనన్న సురక్ష

మునగపాక: మునగపాక సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హాజరవుతారని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన


పీఎల్ పురంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాయకరావుపేట : ప్రజలు, విద్యార్థులు సైబర్ నేరాలు బారిన పడకుండా ఎస్ఐ బి.జోగారావు అవగాహన కల్పించారు. పీఎల్ పురం గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు.

జగనన్న పాలనలో చల్లగా ఉన్నాం...


కొత్త పోలవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : గత ప్రభుత్వం హయాంలో తమకు ఏ సహాయం కావాలన్నా నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లు అరిగిపోయేలా తిరగాల్సివచ్చేదని, ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో తమ ఇంటికి వచ్చి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొత్త పోలవరం గ్రామస్తులు పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. అంతకుముందు రామాలయంలో పూజలు నిర్వహించారు. ఆయనను స్వామి వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రజలను పలకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో గడప గడపకు

ఎస్.రాయవరం : వాకపాడు శివారు కాపులవాతాడ, బంగారమ్మపాలెం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొంటారని, మండల అధికారులు విధిగా హాజరుకావాలని అన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు అందుబాటులో ఉండాలన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు


యలమంచిలిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేసున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో యర్రవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారికి డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలసి ఎమ్మెల్యే ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కార్యకర్తలతో వసూళ్ల పర్వం కొనసాగేదని, దీనివల్ల అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేవి కావన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు కుల, మత, వర్గ విభేదాలు లేకుండా, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. యర్రవరంలో మంగళవారం సాయంత్రానికి 1315 మందికి ధ్రువీకరణ పత్రాలు అధికారులు అందజేసినట్టు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్త, నాగేశ్వరరావు, కౌన్సిలర్ సత్తిబాబు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యద్ బీబి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండబాబు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించండి


రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన ఈఆర్‌వో

నక్కపల్లి : మండలంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమై, వచ్చే నెల 21వరకు నిర్వహించే ఓటర్ల వెరిఫికేషన్‌కు సంబంధించి ఇంటింట సర్వేకు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.వి.రామలక్ష్మి రాజకీయ పక్షాలను కోరారు. మంగళవారం ఆమె నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు, వీఆర్వోలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాల పరిశీలన చేస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలు, చేర్పులు ప్రక్రియ కూడా జరుగుతోందని తెలిపారు. ఓట్ల తొలగింపులకు సంబంధించి కుటుంబ యజమాని డిక్లరేషన్ తీసుకుంటామన్నారు. తొలగింపులు, చేర్పులకు సంబంధించిన అభ్యంతరాలుంటే తహసీల్దార్‌కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు నమోదు చేయించుకోవచ్చన్నారు.

టోల్‌గేటు వద్ద పనస ఘుమఘుమ


టోల్‌గేట్ వద్ద పనస పండ్లు విక్రయిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మైదానంలో మన్యం పనస ఘుమఘుమలాడుతోంది. జాతీయ రహదారిపై వేంపాడు టోల్‌వేట్ వద్ద ఇప్పటికే కొబ్బరి బొండాలు, అరటి పండ్లు, మామిడి పండ్లు, పుచ్చకాయలకు తోడు, పనస పళ్లు కూడా వచ్చి చేరాయి. ఏజెన్సీ నుంచి తెచ్చిన పనస కాయలు, పనస పళ్లు ఇక్కడ విక్రయిస్తున్నారు. పనసపండు రూ.50 నుంచి రూ.100 వరకు ధర ఉంది. పనస తొనలను సయితం డజన్ల లెక్కన కొందరు చిల్లర వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణికులు జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

అక్రమ మద్యంతో ఇద్దరి అరెస్టు


నిందితులతో సీఐ అప్పన్న, పక్కన ఎస్ఐ ప్రసాద్‌రావు

ఎస్.రాయవరం : మండల కేంద్రం పరిసర ప్రాంతంలో ఇద్దరు వ్యక్తుల నుంచి 864 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్టు నక్కపల్లి సీఐ జి.అప్పన్న తెలిపారు. ఎస్.రాయవరం గ్రామం సమీపంలో మద్యం నిల్వ చేసి బెల్టు షాపులకు తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం ఎస్ఐ ప్రసాదరావు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఓ షెడ్డులో యానాం నుంచి తీసుకువచ్చిన మద్యం సీసాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. మద్యం నిల్వ చేసిన ఇద్దరు నిందితులను పట్టుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

నేటి నుంచి తిమ్మాపురంలో రీ సర్వే

ఎస్.రాయవరం : జగనన్న భూరక్ష రక్ష కార్యక్రమాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. తిమ్మాపురం గ్రామంలో జగనన్న భూరక్ష సర్వే పనులు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. సర్వేయర్లు గ్రామంలో ప్రతి నంబర్‌ని పరిశీలించి సర్వే చేస్తారని, ఆ సమయంలో సరి చేసే పనులు ఉంటే వారి దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు సహకరిస్తే పనులు వేగవంతం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తులు, వీఆర్వో నూకరాజు పాల్గొన్నారు.